సాక్షి
ఒడిశా

శుక్రవారం । 24 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,35,938లు, బంగారం 5గ్రాముల 500 మిల్లీగ్రాములు, వెండి 145 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది

ఈ నెల 25న 3వ దశ పోలింగ్ భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజక వర్గంలో జరగనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది పోలింగు కేంద్రాలకు తరలివెళ్లారు.

- 8లో



అన్నమయ్య జయంతి

పద కవితా పితామహుడు, తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంత్యుత్సవం పర్లాకిమిడిలో గురువారం వైభవంగా నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

5 రోజుల పాటు పలు ట్రైన్ల నిలుపుదల



పర్లాకిమిడి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

పర్లాకిమిడి: పర్లాకిమిడి రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్నందున ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు పలు రైళ్లు రద్దు చేశారు. మరికొన్నింటిని పలాస వరకు పరిమితం చేశారు. పూరీ నుంచి గుణుపురం, గుణుపురం నుంచి పూరీ వెళ్లే రైలును 27, 28వ తేదీల్లో పలాస వరకు పరిమితం చేశారు. అలాగే రౌర్కెలా–భుభనేశ్వర్–గుణుపురం (రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ నెం.18117)ను కూడా 24 నుంచి 27వ తేదీ వరకు పలాస వరకు పరిమితం చేశారు. అలాగే పలాస విశాఖపట్నం ప్యాసింజరు (07471), విశాఖపట్నం–గుణుపురం, గుణుపురం నుంచి విశాఖపట్నం ప్యాసింజర్లు తాత్కాలికంగా ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్టు సీనియర్ డివిజనల్ మేనేజరు కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు.

యుద్ధప్రాతిపదికన సాగర్ పనులు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కార్తివాసన్

జయపురం: జయపురంలో చారిత్రక జగన్నాథ్ సాగర్, కొట్‌పాడ్‌లో ప్రసిద్ధ దమయంతి సాగర్ పురుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కార్తివాసన్ అధికారులను ఆదేశించారు. గురువారం జయపురం మున్సిపాలిటీలోని కౌన్సిల్ సభాగృహంలో పునరుద్ధరణ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు రాకముందే సాగర్‌లో పూడికలు తొలగించాలని సూచించారు. సాగర్‌లో పక్షుల కోసం ప్రత్యేక ద్వీపం ఏర్పాటు చేయాలన్నారు. సాగర్ సుందరీకరణకు రూ.14 కోట్ల 85 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఇప్పటి వరకు రూ.2 కోట్ల 20 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. అనంతరం క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించారు. కార్యక్రమంలో జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడా, జిల్లా పట్టణాభివృద్ధి అధికారి దేవీప్రసాద్ టాలీ, తహసీల్దార్ మనోశిస ఆచార్య, ప్రభుత్వ కార్యనిర్వాహక ఇంజినీర్ విశ్వనాథ్ పాత్రో, జూనియర్ ఇంజినీర్ ప్రతాప్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు



సునీతా నాయక్


రాయగడ: ఉపాధి కోసం పొరుగు రాష్ట్రానికి రెండేళ్ల కిందట వెళ్లిన తన కుమార్తె ఆచూకీ కానరావడం లేదని తండ్రి మోహన్ నాయక్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. స్థానిక రాణిగుడఫారం ఫారెస్టు కాలనీలో నివాసముంటున్న మోహన్ నాయక్ కుమార్తె సునీత (27) రెండేళ్ల క్రితం పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా ఎరకరాం అనే ప్రాంతంలో రొయ్యల పరిశ్రమలో పని చేసేందుకు స్నేహితులతో కలిసి వెళ్లింది. ప్రతి నెలా ఇంటికి కొంత డబ్బులు పంపిస్తుండేది. రెండేళ్లుగా రాని తన కుమార్తె ఈ నెల 13న ఇంటికి వస్తున్నానని ఫోన్ ద్వారా తెలియజేసింది. 13న కాకినాడ నుంచి బయలుదేరి సామర్లకోట రైల్వే స్టేషన్‌లో దిగి మరో ట్రైన్ కోసం ఎదురు చూస్తున్నట్లు చెప్పింది. అప్పటికే రాయగడ చేరాల్సిన ట్రైన్ తప్పిపోయానని, మరో రైలులో వస్తున్నట్లు సమాచారం అందించింది. తీరా రాత్రి పది కావస్తున్నా ఇంటికి చేరకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అప్పటి నుంచి వెతుకుతున్నా ఫలితం లేకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఐఐసి కేకేబీకే కుహరో ఆంధ్రా పోలీసులకు సమాచారం అందించి గాలింపు చర్యలు చేపడతున్నారు.

ఫోన్ వద్దు.. పుస్తకం ముద్దు

జయపురం: మొబైల్ ఫోన్‌లకే అతుక్కుపోకుండా పుస్తకాలు చదివి జ్ఞానం పెంపొందించుకోవాలని ఉమ్మరకోట్‌లో ఫకీర్ మోహన పాఠాఘర్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గ్రామాల్లో చిన్నారులకు డ్రాయింగ్, పాటల పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రఫుల్ల రౌత్, డాక్టర్ సురేంద్రనాద్ దాస్, విద్యా విభాగ అధికారి ఉమేష్ చంద్ర రథ్, రతికాంత సాహు, శాంతి మహంతి, న్యాయవాది శ్రీనివాస పట్నాయక్ పాల్గొన్నారు.

మూడో దశ.. ఎన్నికలకు సిద్ధం

- ముగిసిన ప్రచారం
- 25న పోలింగ్
- 200 ఆదర్శ పోలింగ్ కేంద్రాలు
- 121 సీఏపీఎఫ్ కంపెనీల మోహరింపు



భువనేశ్వర్: రాష్ట్రంలో మూడో దశ ఎన్నికల పోలింగు శాంతియుతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నికుంజ బిహారి ధొలొ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 25న రాష్ట్రంలో ఏకకాలంలో జరగనున్న మూడో దశ లోక్ సభ, శాసన సభ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు 121 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను (సీఏపీఎఫ్) మోహరించాలని భారత ఎన్నికల సంఘం నిర్ణయించిందన్నారు. 3వ దశ ఎన్నికలకు ప్రచారం గురువారం సాయంత్రంతో ముగిసిందని చెప్పారు.

- పూరీ, భువనేశ్వర్, కటక్, ఢెంకనాల్, కెంజొహర్, సంబల్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గాలతో పాటు వాటి పరిధిలోని 42 శాసనసభ స్థానాలకు ఈ విడతలో ఓటింగ్ జరగనుందని వివరించారు.
- రాష్ట్రంలో 94, 48,553 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని సీఈఓ తెలిపారు. వీరిలో 48.30 లక్షల మంది పురుషులు, 46.18 లక్షలు మహిళలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఓటర్లలో దాదాపు 21 శాతం మంది యువకులు ఉండడం విశేషంగా తెలిపారు.
- 10,551 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. వీటిలో దాదాపు 200 ఆదర్శ పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేసినట్లు వివరించారు. 2,000 పోలింగ్ స్టేషన్లు కీలకమైనవిగా గుర్తించామని, అక్కడ ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.
- మహిళా పోలింగ్ సిబ్బంది ప్రత్యక్ష పర్యవేక్షణలో 1,500 పోలింగ్ కేంద్రాలు, దివ్యాంగుల పర్యవేక్షణలో 30 పోలింగ్ కేంద్రాలు పని చేస్తాయన్నారు. ఎన్నికల నిర్వహణకు 70 వేల మంది పోలింగ్ సిబ్బందిని నియమించనున్నట్లు సీఈఓ తెలిపారు. దేవ్‌గడ్‌లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగు జరుగుతుందని, మిగిలిన అన్ని స్థానాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ప్రకటించారు.

భారీగా పోటీ..

ఈ విడత పోలింగులో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పోటీ చేస్తున్నారు. 42 అసెంబ్లీ స్థానాలకు 383 మంది ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. వీరిలో 339 మంది పురుషులు, 44 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. 6 పార్లమెంటరీ నియోజకవర్గాలకు 64 మంది ఎంపీ అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో 55 మంది పురుష అభ్యర్థులు, 9 మంది మహిళా అభ్యర్థులు ఆరు లోక్‌సభ నియోజకవర్గాలకు పోటీలో ఉన్నారని సీఈవో వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నికుంజ బిహారి ధొలొ

పిడుగు పడి మహిళ మృతి



మహిళ మృతదేహం

మల్కన్‌గిరి: కలిమెల సమితి బేజాంగవాడ గ్రామంలో గురువారం సాయంత్రం వేరుశనగ మొక్కలు కోసేందుకు వెళ్లిన ఓ మహిళపై పిడుగు పడడంతో ఆమె మృతి చెందారు. గ్రామస్తులతో కలిసి ఓ మహిళ వేరుశనగ మొక్కలు తీస్తుండగా పిడుగు పడింది. ఆ ధాటికి ఆమె అక్కడే కుప్పకూలిపోయారు. తోటి కూలీలు వెంటనే కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. వెంటనే కలిమెల పోలీసు ఐఐసి చంద్రకాంత్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన తన సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని కలిమెల ఆరోగ్యకేంద్రానికి తరలించారు.

విచారణ ఖైదీల పిల్లలకు పునరావాసం



మహిళా ఖైదీ ముగ్గురు శిశువులతో న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శితో జెన, శిశు సురక్షా అధికారి

జయపురం: జయపురం సబ్‌జైలులో విచారణలో ఉన్న ఓ మహిళా ఖైదీ తన ముగ్గురు పిల్లలకు పునారావాసంతో పాటు విద్యాసౌకర్యం కల్పించాలనే అభ్యర్థన మేరకు జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ తక్షణ చర్యలు తీసుకుంది. ఇటీవల జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవా ప్రదీకరణ అధ్యక్షులు, న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జేన జయపురంలోని సబ్‌జైలును సందర్శించారు. ఖైదీలకు ఇచ్చే ఆహారం, వంటశాల పరిశుభ్రత, తాగునీరు, జైలు పారిశుధ్యం తదితర విషయాలు పరిశీలించారు. అనంతరం వారు ఖైదీల సమస్యలపై చర్చించారు. ఈ సమయంలో ఒక మహిళ తాను జైలులో ఉన్నానని తన ముగ్గురు బిడ్డలు ఊరిలో దిక్కు లేక కష్టపడుతున్నారని, వారిని ఆదుకోవాలని న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షులు, జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర, కార్యదర్శి సుమన్ జెనలను ఆమె కోరింది. తన ముగ్గురు పిల్లలకు ప్రభుత్వం తరఫున పునరావాసం కల్పించి, వారికి తిండి, బట్టలు సమకూర్చి చదువు చెప్పించాలని విజ్ఞప్తి చేసింది. ఆ ఖైదీ అభ్యర్థనను దరఖాస్తు ద్వారా తమకు ఈ మెయిల్ ద్వారా పంపించాలని జిల్లా న్యాయ సేవా అధ్యక్షుడు మిశ్ర సబ్ జైలు సూపరింటెండెంట్‌కు సూచించారు. జైలు సూపరింటెండెంట్ వెంటనే స్పందించి ఆమె దరఖాస్తును మెయిల్ ద్వారా పంపించారు. ఆ దరఖాస్తు అందిన వెంటనే న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెన కొరాపుట్ జిల్లా శిశు సురక్ష, జిల్లా శిశు కల్యాణ కమిటీలకు పంపి వెంటనే ఆ శిశువులను సంరక్షణలోకి తీసుకుని పునరావాసం కల్పించాలని ఆదేశించారు. కొరాపుట్ జిల్లా శిశు సురక్షా అధికారి రాజశ్రీ దాస్, శిశు కల్యాణ కమిటీ శ్రీమతి గాయిత్రీ పాత్రో, వెంటనే తమ సిబ్బందితో మహిళా ఖైదీ పిల్లలు ఉంటున్న దేవ్‌గుడ గ్రామం వెళ్లి ఆ ముగ్గురు పిల్లలను తమ ఆధీనంలోనికి తీసుకొని కొరాపుట్‌లోగల శిశు రక్షణ గృహానికి తరలించారు. అక్కడ వారికి ఉచిత భోజనం, నివాస సదుపాయాలు కల్పించారు.

గంట మోగించిన బంటి



శివాలయంలో గంటలు మోగిస్తున్న ఎలుగుబంటి.

జయపురం: శివాలయంలో ఒక ఎలుగుబంటి గంట మోగిస్తున్న వీడియో స్థానికంగా వైరల్ అయ్యింది. ఈ సంఘటన బొరిగుమ్మ సమితి చంపియ గ్రామ శివమందిరంలో జరిగినట్లు సమాచారం. బుధవారం రాత్రి రెండు ఎలుగుబంట్లు ఆహారం కోసం ఆలయంలోకి ప్రవేశించాయి. అవి ఆలయ ప్రవేశ ద్వారం ముందు గల గంటలను మోగించాయి. గంటల శబ్దం విన్న ఆ ప్రాంతంలోని కొంత మంది యువకులు ఆ వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు.

మల్కన్‌గిరి నుంచి అయోధ్యకు..



బైక్ పై అయోధ్య ప్రయాణానికి సిద్ధమైన రామ భక్తులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఎన్‌పీసీ నుంచి గురువారం నలుగురు వ్యక్తులు అయోధ్యకు బైక్‌పై బయల్దేరారు. ఉమాకాంత్ దాస్ (51), శ్రీనివాస్ పండా(43), జగబంద్ పాభ్(42), ప్రదీప్త్ కుమార్ దాస్ (52) 1300 కిలోమీటర్ల ప్రయాణాన్ని ప్రారంభించారు.

బైకు, ట్రాక్టర్‌ఢీ: ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులను లోయలో నుంచి బయటకు తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది



ప్రమాదానికి గురైన ట్రాక్టర్

రాయగడ: బైకు, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి ఛతొపాదొరొ సమీపంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను కలహండి జిల్లా కె.సింగ ప్రాంతానికి చెందిన తుషార్‌పటేల్ (32), గొపాల్‌పూర్ ప్రాంతానికి చెందిన ఓం పటేల్ (29)గా పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన వీరిని కల్యాణసింగుపూర్‌లోని పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. కె.సింగ నుంచి బైకుపై వస్తున్న తుషార్, ఓం పటేల్‌లు ఛతొపాదొరొ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో బైకు పైనుండి ఇద్దరూ లోయలో పడిపోగా ట్రాక్టర్ అదుపుతప్పి కింద పడిపోయింది. ఈ క్రమంలో గాయాలు తగిలిన వారిని లోయలో నుంచి తీసే ప్రయత్నం చేయగా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది తాళ్ల సహాయంతో లోయలోకి బయటకు తీశారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్రంపై తుఫాన్ ప్రభావం అంతంతమాత్రమే

భువనేశ్వర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ఘనీభవించి ఈ నెల 25 శనివారం ఉదయం నాటికి తుఫానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆదివారం సాయంత్రానికి తుఫాన్ బంగ్లాదేశ్ వైపు పయనిస్తూ పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకుంటుందని వాతావరణ శాఖ సమాచారం. దీని ప్రభావంతో ఒడిశాలోని కోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ అల్ప పీడనం ఇప్పుడు ఈశాన్య దిశగా కదిలి వర్షపాతంగా మారే అవకాశం ఉంది. శుక్రవారం ఉదయం నాటికి బంగాళాఖాతంలో తుపానుగా మారి ఈశాన్య దిశగా పయనించే అవకాశం ఉంది. మే 25 ఉదయం నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుఫాన్ తీవ్రంగా మారనుంది. దీని ప్రభావంతో బంగాళా ఖాతంలో తుఫాను ఏర్పడుతుందని అంచనా.

ఒడిశాపై ప్రభావం లేదు..

తదనంతరం ఇది దాదాపు ఉత్తరం వైపుగా కదులుతూ బంగ్లాదేశ్, ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ తీరాలను మే 26 సాయంత్రం నాటికి తీవ్రమైన తుఫానుగా మానుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మే 25న జరగనున్న 3వ దశ ఎన్నికలపై తుఫాను ప్రభావం ఉండదని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహపాత్రో తెలిపారు. ఆ రోజున సైక్లోనిక్ తుఫాను తీరానికి చాలా దూరంగా ఉంటుందన్నారు.

మత్స్యకారులకు హెచ్చరిక..

మత్స్యకారులు ఈ నెల 27 వరకు సముద్రంలోకి వెళ్లవద్దని ఆయన సూచించారు. మే 26న, బాలాసోర్, భద్రక్, మయూర్‌భంజ్ జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేశారు. మే 24 వరకు దక్షిణ బంగాళాఖాతం, మే 26 వరకు మధ్య బంగాళా ఖాతం, మే 24 నుంచి మే 27 వరకు ఉత్తర బంగాళా ఖాతంలోకి వెళ్లవద్దని స్థానిక ఐఎండీ శాస్త్రవేత్త ఉమాశంకర్ దాస్ సూచించారు. సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు తీరానికి తిరిగి రావాలని తెలిపారు.

కంధమల్‌లో రీపోలింగ్ ప్రశాంతం



పోలీసు భద్రత మధ్య బారులు పోలింగు కేంద్రంలో ఓటు కోసం నిరీక్షిస్తున్న ఓటర్లు.

భువనేశ్వర్: కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య కంధమల్ జిల్లాలోని రెండు పోలింగ్ కేంద్రాలలో గురువారం రీపోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు సిబ్బందితో పాటు ఇద్దరు మేజిస్ట్రేట్‌లను నియమించారు. కంధమల్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని కొంటామల్ శాసనసభ స్థానంలోని 26వ నంబర్ కిరాసిరా కేంద్రం, 28వ నంబర్ మహేశ్వరపిండ్ బూత్‌లో ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. ఈ నెల 20వ తేదీన ఐదు లోక్‌సభ స్థానాలతో అనుబంధ 35 శాసన సభ సెగ్మెంట్లలో జరిగిన పోలింగ్‌తో కొంటామల్ అసెంబ్లీ స్థానంలోని ఈ రెండు బూత్‌లలో పోలింగ్ జరగడం గమనార్హం. ఈ సందర్భంగా కొంటామల్ నియోజకవర్గంలో బూత్ రిగ్గింగ్ జరిగినట్లు ఆరోపణలు రావడంతో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రీపోలింగ్ నిర్వహించాలని నిర్ణయించింది.

నదిలో మునిగి మహిళ మృతి



దేభి కర్తమి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని పొడియా సమితి పరిధిలో శబరి నదిలో స్నానం కోసం దిగి దేభి కర్తమి(30) అనే మహిళ మృతి చెందారు. దేభి తన కుమార్తె శివనితో కలిసి గురువారం పొలం పని చేసుకుని ఇంటికి తిరిగి వస్తూ నదిలో స్నానానికి దిగారు. బిడ్డకు స్నానం చేయించి గట్టుపై ఉంచి ఆమె కాస్త లోతులోకి వెళ్లారు. కానీ కాలుజారి లోపలకు వెళ్లిపోయారు. దీంతో ఒడ్డున కూర్చున్న కుమార్తె బిగ్గరగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూశారు. అప్పటికే దేభి మృతి చెందారు. పొడియా పోలీసు ఐఐసీ రామేశ్వర్ ప్రధాన్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పొడియా ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు.

● జట్నీలో ఫ్లాగ్‌మార్చ్



ఖుర్దా జిల్లా జట్నీ మండలం ఖుద్‌పూర్ గ్రామం నుంచి జట్నీ టౌను వెళ్లే మార్గంలో పోలీసులు శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. శనివారం జరగనున్న 3వ దశ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు జట్నీ పోలీసు ఠాణా అధికారి సౌమ్యకాంత తెలిపారు. - భువనేశ్వర్

పిట్టను కాల్చబోయి.. స్నేహితుడిని కాల్చేశాడు

- పొట్టలోకి దూసుకెళ్లిన తూటా
- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడని నమ్మించి ఆస్పత్రిలో చికిత్స
- అనుమానించిన వైద్యులు
- ఆపరేషన్ చేసి కడుపులో నుంచి తూటా తీసిన వైనం
- నిందితుని అరెస్టు





చికిత్స పొందుతున్న నాగేశ్వరరావు (ఇన్‌సెట్లో) అరెస్టయిన లింగన్న

రాయగడ: వేట కోసం అడవికి వెళ్లిన ఇద్దరు స్నేహితుల్లో ఒకరు నాటుతుపాకీతో పిట్టను కాల్చబోతుండగా ప్రమాదవశాత్తు స్నేహితుని పొట్టలోకి తూటా దూసుకెళ్లిన సంఘటన రాయగడ జిల్లాలోని బిసంకటక్ సమితి బాతుపర్‌లో చోటు చేసుకుంది. పొట్టలోకి తూటా దూసుకుపోవడంతో స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. దీన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి బిసంకటక్‌లోని క్రిస్టియన్ ఆస్పత్రిలో చేర్పించారు. అనుమానించిన వైద్యులు గాయపడిన వ్యక్తికి చికిత్సలో భాగంగా ఆపరేషన్ చేయగా కడుపులో తూటా బయటపడింది. దీంతో అప్రమత్తమైన వైద్యులు బిసంకటక్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దర్యాప్తు చేసి వారం తరువాత నిందితుని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే..

రాల్లోకి వెళితే..

బిసంకటక్ సమితి బాత్‌పూర్ గ్రామానికి చెందిన లింగన్న హిమిరిక (32), అతని స్నేహితుడు నాగేశ్వరరావు హిమిరిక (34)లు ఈ నెల 15వ తేదీన సమీపంలోని అడవులకు వెళ్లారు. లింగన్న తన వద్ద గల నాటు తుపాకీతో పిట్టను వేటాడేందుకు పేల్చాడు. అయితే ప్రమాదవశాత్తు తూటా పేలి ఒక రాయికి తగిలి తిరిగి అది పక్కనే ఉన్న నాగేశ్వరరావు పొట్టలోకి చొచ్చుకుపోవడంతో తీవ్రంగా గాయపడి కిందపడిపోయాడు. గ్రామస్తుల సహకారంతో గాయపడిన నాగేశ్వరరావును బిసంకటక్‌లోని క్రిస్టియన్ ఆస్పత్రిలో చేర్పించాడు. రెండు రోజులైన గాయం మానకపోవడంతో వైద్యులకు అనుమానం వచ్చింది. దీంతో ఎక్స్‌రే తీయగా కడుపులో తూటా ఉండటాన్ని గుర్తించారు. వెంటనే ఆపరేషన్ చేసి తూటాను బయటకు తీశారు. ఆస్పత్రి యజమాన్యం బిసంకటక్ పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు గాయపడిన నాగేశ్వరరావును విచారించగా విషయం బయటపెట్టాడు. అనంతరం దర్యాప్తు చేసిన పోలీసులు బుధవారం నాడు లింగన్నను అరెస్టు చేసి అతని నుంచి ఒక నాటు తుపాకీ, మూడు తూటాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టుకు తరలించారు.

క్లుప్తంగా

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కార్డన్ సెర్చ్



హిరమండలంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

హిరమండలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నారు. గురువారం మేజర్ పంచాయతీ హిరమండలం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో స్థానిక ఎస్ఐ జి.నారాయణ స్వామి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విస్తృతంగా సోదాలు నిర్వహించారు. వివాదాస్పద వ్యక్తులు, అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అలాగే పశువుల శాలలు, గడ్డివాములు క్షుణ్ణంగా పరిశీలించారు. ఓట్ల లెక్కింపు సమీపిస్తున్న తరుణంలో శాంతిభద్రతలకు విఘాతం లేకుండా చూడాలని ఎస్పీ ఆదేశించించడంతో ఈ పరిశీలనలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐజేనాయుడు కాలనీలో కార్డన్ సెర్చ్

ఆమదాలవలస రూరల్: మున్సిపాలిటీ పరిధిలో గల ఐజేనాయుడు కాలనీలో ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్, ఫ్లాగ్‌మార్చ్ గురువారం నిర్వహించారు. కాలనీలో ఇంటింటా ఉన్న ద్విచక్ర వాహనాల రికార్డులను తనిఖీలు నిర్వహించి, ఎలాంటి పత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. వాహనదారులు తగిన పత్రాలు కలిగి ఉండాలని లేకుంటే సీజ్ చేస్తామని తెలిపారు.

ఎంపికైన విద్యార్థుల జాబితా వెబ్‌సైట్‌లో

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం హయాతీనగరం ఉన్న మహాత్మజ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశపరీక్షలో ఎంపికైన విద్యార్థినుల జాబితా అధికారిక వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉన్నట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గొలివి స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఎంపికైన విద్యార్థినుల పేర్లు ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎఫ్.ఇన్ వెబ్‌పోర్టల్‌లో ఉంచినట్టు వెల్లడించారు. ప్రవేశాల సమయంలో తమ వెంట రికార్డు షీటు, ర్యాంకు కార్డు, కుల, ఆదాయ పత్రాలు, ఆధార్‌కార్డులు తీసుకురావాలని సూచించారు.

క్యాంపస్ డ్రైవ్‌లో ఏడుగురు ఎంపిక

- ఏడాదికి రూ.21 లక్షలు ప్యాకేజీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గురువారం మణప్పురం ఫైనాన్షియల్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. 37 మంది హాజరు కాగా, రాత పరీక్ష, ఇంటర్వ్యూలు ద్వారా ఏడుగురిని ఎంపిక చేశారు. వర్సిటీ ప్లేస్‌మెంట్ అధికారి కె.విద్యాసాగర్ క్యాంపస్ డ్రైవ్ పర్యవేక్షించారు. కంపెనీ ప్రతినిధుల బృందం ఎంపిక ప్రక్రియ నిర్వహించింది. ఎంపికైన వారికి ఏడాదికి రూ.21 లక్షలు ప్యాకేజీ అందజేయనున్నట్లు ప్లేస్‌మెంట్ అధికారి తెలిపారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

హిరమండలం: స్థానిక చిన్నకోరాడ వీధి చివరన మద్యం మత్తులో డ్రైనేజీలో పడి వ్యక్తి ఓ మృతి చెందాడు. ఎస్ఐ జి.నారాయణ స్వామి తెలిపిన వివరాల మేరకు.. మేజర్ పంచాయతీ హిరమండలం మేదరవీధికి చెందిన తెల్లి మల్లేశ్వరరావు(44) ఓ హోటల్ లో పనిచేస్తుండేవాడు. బుధవారం చిన్నకోరాడ వీధి శివారులో ఉన్న డ్రైనేజీ ఖానాపై కూర్చుని మద్యం మత్తులో వెనక్కి తూలడంతో కాలువలో పడిపోయాడు. ముఖం నీటిలో మునిగిపోవడం, ఆ మత్తులో పైకి లేవలేకపోవడంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు ఎస్ఐ గురువారం తెలిపారు. మృతుడికి భార్య రాజేశ్వరి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీళ్లంతా ప్రస్తుతం అయోధ్య రామాలయం యాత్రలో ఉన్నారు. మృతుని సోద రుడు టి.రమణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

గారపేటలో వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

పొందూరు: మండలంలోని గారపేట(క్రిష్ణాపురం) గ్రామంలో వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ మృతి చెందారు. గ్రామానికి చెందిన చెందిన గార కిత్తయ్య ఉపాధి పనిచేస్తుండగా వడదెబ్బ తగలడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తోటి కార్మికుల సాయంతో కిత్తయ్యను ఇంటికి తీసుకువచ్చిన కుటుంబ సభ్యు లు ప్రాథమిక చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన కిత్తయ్య మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సముద్రం వెనక్కి..

వజ్రపుకొత్తూరు రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండలంలో గల అక్కుపల్లి శివసాగర్ తీరంలో గురువారం మార్పు చోటు చేసుకుంది. ఉదయం సముద్ర కెరటాలు ఉద్రిక్తంగా ఎగసిపడుతూ తీరం వైపు దూ సుకువచ్చాయి. అలా కొద్దిసేపటి వరకు తీరం వైపు దూచుకువచ్చిన సముద్రం ఒక్క సారిగా సుమారు 100 మీటర్లు వెనక్కి వెళ్లడంతో పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు. బంగాళాఖాతంలో అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరికలు చేసింది. పర్యాటకులు సైతం సముద్ర స్నానం చేసేందుకు వెనుకంజ వేశారు.

ఘనంగా తాళ్లపాక అన్నమయ్య జయంతి



ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న భాస్కరభట్ల



క్రిష్ణమూర్తిని సన్మానిస్తున్న తిరుపతిరావు మాస్టారు

పర్లాకిమిడి: పద కవితా పితామహుడు, తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంత్యుత్సవానిన పర్లాకిమిడిలో గురువారం వైభవంగా నిర్వహించారు. సులలితా సంగీత భారతి అనే లలిత సంగీత పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాతపట్నం కిరణ్మయి విద్యాసంస్థల అధినేత తూలుగు తిరుపతిరావు హాజరయ్యారు. భాస్కరభట్ల కృష్ణమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా.. వ్యాఖ్యాతగా వెల్లంకి కూర్మనాథరావు వ్యవహారించారు. అన్నమయ్య 14వ శతాబ్దంలోవేంకటేశ్వరునిపై 32 వేల గేయాలు, పదకవితలు రాసినప్పటికీ.. అందుబాటలో కేవలం 12 వేల అన్నమయ్య కీర్తనలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని మరో అతిథి.. విశ్రాంత ఉపాధ్యాయులు చెట్టి వేంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా కడప ఆలిండియా రేడియో విద్వాంసులు భాస్కరభట్ల కృష్ణమూర్తిని వేదికపై ముఖ్యఅతిథి తిరుపతిరావు మాస్టారు చేతుల మీదుగా దుశ్శాలువ, మెమెంటోతో సన్మానించారు. కార్యక్రమంలో అన్నమయ్య కీర్తనలను గుణశేఖర్ సుమధురంగా వినిపించగా కీబోర్డు ప్యాడ్‌పై రాజేష్ సహకరించారు. సులలితా సంగీత విభావరి విద్యార్థులకు మెమెంటోలను ముఖ్యఅతిథి తిరుపతిరావు అందజేశారు. కార్యక్రమంలో సులలితా సంగీత విభావరి పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఆర్.రవి, కార్యదర్శి మరువాడ శివరామక్రిష్ణ, చైతన్య మహిళా సంఘం అధ్యక్షురాలు కోట్ని శోభారాణి పాల్గొన్నారు.



అన్నమయ్య సంకీర్తనలు వినిపిస్తున్న గుణశేఖర్



ఉత్సవానికి విచ్చేసిన మహిళలు

కుసుమిలో ముగిసిన బలిజాతర



బలిజాతర నిర్వహిస్తున్న భక్తులు

జయపురం: నవరంగపూర్ జిల్లా కుసుమి గ్రామంలో వ్యవసాయ సంబంధిత బలిజాతర బుధవారం సాయంత్రం విశాల జాతరతో ముగిసింది. గత 49 ఏళ్ల క్రితం బలిజాతర ఇక్కడ నిలిచిపోయింది. తిరిగి ఈ ఏడాది నుంచి ప్రారంభించినట్లు గ్రామస్తులు వెల్లడించారు. ప్రజల సుఖజీవనం, గ్రామ మంగళం, పంటలు బాగా పండాలని, గృహపాలిత పశుపక్షాదులు క్షేమంగా ఉండాలని కోరుతూ బలిజాతర జరిపినట్లు పేర్కొన్నారు. బలి జాతరలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన దేవతల లాఠీలు, దేవీ ఆసనాలైన కుర్చీలతో ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో ప్రజలు గ్రామ దేవత గుడిలో విత్తన మొలకల బుట్టలను తలలపె పెట్టుకొని ప్రజలు పాల్గొన్నారు. ఈ జాతరలో బలిజాతరలో త్రిలోచన పూజారి, గురుమాయి సమరి అమనాత్య, గ్రామ శిరా టిను నాయిక్, దిశారి సనాతన భొత్ర, రామ చంద్ర సమరథ్, జగదేవ్ దిశారి ప్రధాన భూమిక నిర్వహించారు.



విత్తన మొలకల బుట్టలతో భక్తులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కల్యాణ మహోత్సవంలో భక్తులు

రాయగడ: స్థానిక కస్తూరీనగర్‌లోని సత్యనారాయణ ఆలయ 13వ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి కుంకుమ అర్చనలు, అభిషేకాలు, సహస్రనామ పూజలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మావుడూరు కిశోర్‌శర్మ ఆధ్వర్యంలో వ్రత పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి తిరువీధి కార్యక్రమం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం సుమారు రెండు వేల మందికి అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.



పూజలందుకుంటున్న సత్యనారాయణస్వామి

పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది పయనం

భువనేశ్వర్: ఈ నెల 25న 3వ దశ పోలింగ్ భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజక వర్గంలో జరగనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సిబ్బందిని ఖుర్దా జిల్లాలో పలు పోలింగు కేంద్రాలకు తరలించారు. పోలింగు సంబంధిత ఏర్పాట్లు పూర్తయినట్లు ఖుర్దా జిల్లా ఎన్నికల యంత్రాంగం తెలిపింది. స్థానిక బీజేబీ అటానమస్ కాలేజీ ఆవరణలోని స్ట్రాంగ్‌రూమ్ నుంచి పోలింగ్ పార్టీ ఈవీఎంలతో పోలింగ్ బృందాలు కేటాయించిన కేంద్రాలకు తరలి వెళ్లాయి. తొలి విడత కింద పోలింగ్ బృందాలు గురువారం జయదేవ్, జట్నీ రెండు శాసన సభ నియోజకవర్గాల బూత్‌లకు తరలి వెళ్లాయి. జయదేవ్ నియోజక వర్గంలోని మొత్తం 236 పోలింగు కేంద్రాల్లో 164 కేంద్రాలకు సిబ్బంది పూర్తి సరంజామాతో చేరారు. మిగిలిన 72 కేంద్రాలకు పోలింగ్ బృందాలు శుక్రవారం చేరుతాయి. ఈ 72 కేంద్రాల్లో 49 సఖి బూత్‌లు, ఒక దివ్యాంగుల బూత్, 22 ఇతర బూత్‌లు ఏర్పాటు చేశారు.



బీజేబీ అటానమస్ కళాశాల ప్రాంగణంలో పోలింగు సిబ్బంది విరామ శిబిరం కిటకిట



పోలింగు సిబ్బంది సహాయ కేంద్రం.



పోలింగు సరంజామాతో బయల్దేరిన సిబ్బంది

సప్లిమెంటరీకి సర్వం సిద్ధం

- నేటి నుంచి టెన్త్, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- 9 కేంద్రాల్లో పది, 51 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలకు చర్యలు
- ప్రభుత్వ ఆదేశాల మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు



టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు శ్రీకాకుళంలో సిద్ధంచేసిన ఫర్నీచర్

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో శుక్రవారం నుంచి మొదలుకానున్న ఈ పది, ఇంటర్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్ష కేంద్రాలకు మెటీరియల్స్‌ను చేరవేశారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఇలా..

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఫెయిలైన విద్యార్థులతోపాటు ప్రథమ సంవత్సరంలో మార్కులు పెంచుకునేందుకు (ఇంప్రూవ్‌మెంట్/బెటర్‌మెంట్) మరి కొంతమంది పరీక్షలను రాస్తున్నారు. మొత్తం మీద ఈ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల నుంచి 23,668 మంది విద్యార్థులు ఫీజులను చెల్లించారు. వీరి కోసం 51 కేంద్రాలను కేటాయించారు. వీటిలో ప్రభుత్వ యాజమాన్య కళాశాలలే అధికంగా ఉన్నాయి. పరీక్ష కేంద్రాల్లో ఫర్నీచర్‌ను సిద్ధం చేశారు. సీసీ కెమెరాలను ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేసి అమర్చారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించి వారికి డీవీఈఓ కోట ప్రకాశరావు, ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు, డీఈసీ కమిటీ సభ్యులు బి.శ్యామ్‌సుందర్, జి.సింహాచలం, కె.తవిటినాయుడు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. పరీక్ష కేంద్రాలపై నిఘా పెట్టేందుకు హైపవర్ కమిటీ, జిల్లా పరిశీలకులతోపాటు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్, మరో రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు.

రెండు సెషన్స్‌లలో పరీక్షలు..

సప్లిమెంటరీ పరీక్షలను రెండు సెషన్లుగా నిర్వహిస్తున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్నాయి. విద్యార్థులు అర్ధగంట ముందు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, నిర్ణీత సమయానికి హాజరుకాకుంటే.. పరీక్ష కేంద్రం లోపలకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. 144 సెక్షన్ పక్కాగా అమలయ్యేందుకు, పరీక్ష కేంద్రాల వద్ద పహారా కాసేందుకు పోలీసు సిబ్బందిని నియమించారు. ఎలక్ట్రానిక్ పరికరాలను పూర్తిగా నిషేధించారు. ఇన్విజిలేటర్లను నియమించారు. గ్రామీణ ప్రాంతాల్లోని 10 ప్రత్యేక రూట్లలో ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు. ఎండల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని కేంద్రాలలో తాగునీరు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్లతో మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు.



సీసీ కెమెరాల ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌ను పరిశీలిస్తున్న డీవీఈవో కోట ప్రకాశరావు

పదో తరగతి పరీక్షలు ఇలా..

జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాల్లో జరగనున్న టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 2090 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం జరుగుతాయి.

విద్యార్థులు నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, 8.45 నుంచి పరీక్ష కేంద్రం లోపలకు అనుమతిస్తామని తెలిపారు. 9.30 తర్వాత లోపలకు అనుమతించబోమని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు కానుంది. పరీక్ష కేంద్రాలను నో మొబైల్ జోన్‌గా ప్రకటించారు.

మౌలిక సదుపాయాలపై ఫోకస్..

ఎండల నేపథ్యంలో కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రాలపై నిఘా పెట్టేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. 9 కేంద్రాలకు సీఎస్‌లు, డీఓలను నియమించారు. తనిఖీల కోసం విద్యాశాఖ, రెవెన్యూశాఖ, పోలీసుశాఖల పర్యవేక్షణలో 2 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

విజయవంతం చేయాలి..

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సిబ్బందిని నియమించాం. ప్రత్యేకంగా ఏర్పాట్లపై పలు మార్లు సమీక్షించాం. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలి.

– కె.వెంకటేశ్వరరావు, డీఈవో శ్రీకాకుళం

అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం..



ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. విద్యార్థుల హాల్‌టిక్కెట్లు జ్ఞానభూమి వెబ్‌పోర్టల్ బీఐఈఏపీ సర్వీసెస్‌లో అందుబాటులో ఉన్నాయి. డీఈసీ కమిటీ నేతృత్వంలో అధికారులు, సిబ్బందిని ఇప్పటికే నియమించాం. వారికి అనేక అంశాలపై దిశానిర్దేశం చేశాం. అధిక ఎండలు, ఉక్కపోతల నేపథ్యంలో ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాలలో మౌలిక సదుపాయాలను పక్కాగా కల్పించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– ప్రగడ దుర్గారావు, జిల్లా ఆర్ఐఓ, శ్రీకాకుళం

వజ్ర కవచధర గోవిందా..

స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారిని వైశాఖ పౌర్ణమి సందర్భంగా వజ్రకవచధారణతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

– నరసన్నపేట





గరుడ సేవలో..

స్థానిక వేంకటేశ్వరాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం స్వామికి గరుడ వాహన సేవ నిర్వహించారు. ఈ సేవను ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రతినిధి రాదా మనోహరదాస్ ప్రారంభించారు. గరుడ వాహనంపై స్వామిని ఊరేగించారు. – నరసన్నపేట

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



మండలంలోని కుంచాల కుర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో గురువారం పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి పలు అభిషేకాలను నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలను నిర్వహించారు. కుంకుమార్చనలు మహామేరువు, శ్రీచక్రాల వద్ద నిర్వహించారు. – ఎచ్చెర్ల

క్లుప్తంగా

డిప్యూటీ ఈఓ పోస్టుల భర్తీకి పరీక్ష రేపు

విజయనగరం అర్బన్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో భర్తీ చేస్తున్న డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఇన్ ఏపీ ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షను ఈ నెల 25వ తేదీన జిల్లాలోని ఆరు కేంద్రా ల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గు రువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రా జాం జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల, విజయనగ రం ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, భోగాపురం అవంతి ఇంజినీరింగ్ కళాశాల, బొబ్బిలి స్వామి వి వేకానంద ఇంజినీరింగ్ కళాశాల, విజయనగరం సీతం ఇంజినీరింగ్ కళాశాల, సీతం కళాశాల ప్రాంగణంలోని ఐయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్ష కేంద్రా లు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు పరీక్ష జరుగుతుందని.. అభ్య ర్థులు 8.30 గంటలకే హాజరుకావాలని సూచించా రు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఫొటో గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న బాధితురాలు మాధురి

మక్కువ: మండల కేంద్రంలోని హరిజనకాలనీకి చెందిన ఓ మహిళ బుధవారం రాత్రి ఒంటిపై కిరోసిన్ (ఒడిశాలో లభిస్తుంది) పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎస్సై పి.నరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... ఎస్సీ కాలనీకు చెందిన కృష్ణతో మాధురికి 15 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. కొంతకాలం నుంచి భర్త కృష్ణ మద్యానికి బానిస కావడంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో బుధవారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన మాధురి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. వెంటనే కాలనీ వాసులు మంటలార్పి ఆమెను మక్కువ పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి, అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుబండి కింద పడి బాలుడికి తీవ్ర గాయాలు



గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

గజపతినగరం రూరల్: నాటుబండి కింద పడి బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గంగచోళ్లపెంటలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన తామాడ అఖిల్ (9) తన తాతయ్య దేవుడుతో పాటు నాటుబండిపై వెళ్తున్నాడు. అకస్మాత్తుగా అఖిల్ జారిపడిపోగా బండి టైరు ఎక్కిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడ్ని గజపతినగరం సీహెచ్‌సీకి తరలించగా.. పరిస్థితి విషమయంగా ఉండడంతో 108 వాహనంలో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

వంగర: మండల పరి ధి తలగాం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీపేట గ్రామానికి చెందిన కోడూరు సత్యంనాయుడుకు తీవ్రగాయాలయ్యాయి. శివ్వాంలోని ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు లక్ష్మీపేట నుంచి బైక్‌పై వస్తుండగా... గుర్తు తెలియని ఆటో ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యంనాయుడును రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వైవీ జనార్దన్ తెలిపారు.

ఇసుక నిల్వల పరిశీలన



పసుకుడి వద్ద ఇసుక ర్యాంప్‌ను పరిశీలి స్తున్న జేసీ శోభిత

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిత మండలంలోని ఇసుక ర్యాంపుల ప్రతిపాదిత స్థలాలు, అక్కడి ఇసుక నిలువలను గురువారం పరిశీలించారు. వంశధార నదీ తీరప్రాంతాలైన లివిరి, పసుకుడి, బిల్లుమడ గ్రామాల సమీపంలోని ఇసుకతిన్నెలను సందర్శించి, ఇసుక నిలువ స్థాయిలను అంచనా వేశారు. జిల్లా భూగర్భ గనుల శాఖ ఎ.డి శ్రీనివాసరావు, డీజీపీఓ బలివాడ సత్యనారాయణల ఆధ్వర్యంలో గతంలో ప్రతిపాదించిన ఇసుక ర్యాంపుల మ్యాప్‌లను గుర్తించారు. ర్యాంపులు మంజూరైతే ఇసుక లభ్యత, రవాణాకు అనుకూలమైన రోడ్డు సౌకర్యాలపై ఆరా తీశారు. పరిశీలనలో భామిని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, సర్వేయర్ రాజేశ్వరరావు, ఆర్ఐ ఎస్.రాంబాబు, బత్తిలి ఎస్సై సీహెచ్.ప్రసాద్, వీఆర్‌ఓలు, సహాయ సర్వేయర్లు ఉన్నారు.

నిగనిగలంతా..దగానే..!

- మామిడి కాయలు మగ్గించేందుకు రసాయనాల వినియోగం
- రంగే తప్ప రుచి లేని పండ్లతో ఆరోగ్యానికి ముప్పు
- పట్టించుకోని అధికారులు
- రైఫినింగ్ చాంబర్ల ద్వారా మగ్గ బెట్టేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం



విక్రయానికి సిద్ధంగా కృత్రిమంగా పండించిన మామిడి పండ్లు

కొత్తవలస: పట్టణంలో ఎక్కడ చూసినా మామిడి పండ్లు నిగనిగలాడుతూ కనిపిస్తున్నాయి. చూస్తే నోరూరేలా ఎంతో అందంగా కనిపిస్తున్నాయి. అలా అని కొని నోట్లో వేసుకుంటే పుల్లగా, వగరుగా ఉంటున్నాయి. మామిడికాయలు పక్వానికి రాక ముందే కోసి రసాయనాల వినియోగంతో వాటిని పండ్లగా మార్చేస్తున్నారు. వాస్తవానికి మామిడి కాయలు పక్వానికి వచ్చిన తర్వాత సేంద్రియ పద్ధతుల్లో మగ్గబెడితే సువాసన రావడంతో పాటు రుచిగా కూడా ఉంటాయి. అయితే చాలా మంది మామిడికాయలను రసాయనాలతో మగ్గబెడుతున్నారు. అటువంటి పండ్లు వల్ల జీర్ణక్రియ సమస్యలు, క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. రసాయనాల వినియోగం చట్ట ప్రకారం నేరం. కాని అధికారుల ఉదాసీనత వల్ల వ్యాపారులు పేట్రేగిపోతున్నారు. కొన్ని రసాయనాలను నీటిలో కలిపి అందులో మామిడి కాయలను ముంచి పక్కన పెడితే ఒక్క రోజులోనే మంచి రంగు వస్తుంది. ఆకట్టుకునే రంగుతో మామిడిపండ్లు నిగనిగలాడుతుండడంతో ప్రజలు ఎగబడి మరీ



రైఫినింగ్ చాంబర్లలో మామిడి పండ్లను మగ్గిస్తున్న దృశ్యం

కొనుగోలు చేస్తున్నారు.

తగ్గిన మామిడి దిగుబడులు..

జిల్లాలో 30,719 హెక్టార్లలో మామిడి పంట సాగవుతోంది. ఎకరాకి కనిష్టంగా ఐదు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ పంటను స్థానికంగా అమ్మడంతో పాటు కోల్‌కత్తా, ఢిల్లీ, తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే ప్రస్తుత ఏడాది గణనీయంగా దిగుబడులు తగ్గిపోయాయి. ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అంతంత మాత్రంగానే చేస్తున్నారు. నాసిరకం కాయలను రసాయనాలతో మగ్గించి స్థానికంగా విక్రయిస్తున్నారు.

వ్యత్యాసం గుర్తించడం సులువే..

సహజంగా పండిన మామిడి పండ్లు, రసాయనాలతో మగ్గించిన పండ్లను గుర్తిండం సులువే. సహజంగా పండిని మామిడి పండును నీటిలో వేస్తే అది మునిగిపోతుంది. అదే రసాయనాలతో మగ్గించిన పండు అయితే తేలిపోతుంది. అలాగే సహజంగా పండిన పండు నుంచి సువాసన వస్తుంది. అలాగే పండు లోపలి భాగం బంగారు రంగులో ఉంటుంది. రసాయనాలతో పండిన పండును కోస్తే లోపలి భాగం లేత తెలుపు రంగులో ఉంటుంది.

రైఫినింగ్ చాంబర్ల ఏర్పాటుకు ప్రోత్సాహం..

మామిడి పండ్లను ఎటువంటి విషపూరిత రసాయనాలు వినియోగించకుండా మగ్గబెట్టేందుకు ప్రభుత్వం రైఫినింగ్ చాంబర్ల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం ఈ చాంబార్లు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. రైతులు మాత్రమే కాకుండా వ్యాపారులు కూడా తమ పండ్లును ఈ చాంబర్లలో మగ్గించుకోవచ్చు. చాంబర్లో మొదటి రోజు ఏసీ ద్వారా పండ్లను శీతలీకరణ చేస్తారు. తర్వాత రోజు నుంచి మూడు రోజుల పాటు ఇథలిన్ గ్యాస్‌ను పంపించి కాయలను మగ్గిస్తారు. ఈ తరహా రైఫిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకునేవారికి ఉద్యానవన శాఖ 40 నుంచి 50 శాతం రాయితీ ఇస్తోంది.

ఎన్నో సమస్యలు..



రసాయనాలతో మగ్గించిన పండ్లను తింటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా జీర్ణకోశ వ్యాధి, పేగులు దెబ్బతినే అవకాశం, క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయి. సహజంగా పండిన పండ్లనే తినాలి.

– సీతల్‌వర్మ, పీహెచ్‌సీ వైద్యురాలు, కొత్తవలస

50 శాతం రాయితీ..



రైఫినింగ్ చాంబర్ల ఏర్పాటుకు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. జనరల్ కేటగిరీ వ్యక్తులకు 50 శాతం రాయితీతో పథకం వర్తింపజేస్తాం. పూర్తి వివరాలకు సచివాలయాల ఉద్యానవన సహాయకులను సంప్రదించాలి.

– పప్పు పద్మ, కొత్తవలస డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి

విద్యా సదస్సును విజయవంతం చేయండి

- యూటీఎఫ్ జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గజపతినగరం: విజయనగరం జిల్లా కేఎల్ పురంలో నిర్మిస్తున్న శేషగిరి విజ్ఞాన కేంద్రం సెల్లార్‌లో ఈనెల 27న 'విద్యారంగంలో పరిణామాలు, సవాళ్లు' అనే అంశంపై నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి విద్యా సదస్సును విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు కోరారు. ఈ మేరకు గజపతినగరం మండల కేంద్రంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి ప్రముఖ మేధావి విశపు బాలసుబ్రహ్మణ్యంతో పాటు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్, ఉత్తరాంధ్ర నాయకత్వం హాజరవుతుందన్నారు. సదస్సుకు యూటీఎఫ్ ప్రతినిధులంతా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అల్లు శంకరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కె.అప్పారావు, ఆడిట్ కమిటీ సభ్యులు జీవీ నారాయణ, బొండపల్లి, దత్తిరాజేరు మండలాల అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, వి.శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల నిర్లక్ష్యం తగదు..

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి విజయకల్యాణి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి విజయకల్యాణి

విజయనగరం క్రైమ్: వృద్ధుల పట్ల నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి కె. విజయకల్యాణి హెచ్చరించారు. గురువారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ.. వృద్ధులు దైవస్వరూపాలని, వారిని ఆదరించాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫరెంట్లీ ఏబుల్డ్ అండ్ సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్స్ అసిస్టెంట్ డైరెక్టర్ జీవీబీ జగదీష్ మాట్లాడుతూ , ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వృద్ధులకు అవసరమైన ప్రత్యేక సదుపాయాల కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.త్రినాథ్‌ప్రసాద్ మాట్లాడుతూ, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ. రామగోపాల్, సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు చదలవాడ ప్రసాద్, చిన్నతల్లి, కట్టమూరి చంద్రశేఖర్, బి.రమేష్, వృద్ధాశ్రమ నిర్వాహకులు, న్యాయ సేవా సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు అత్యంత కీలకం

- ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నిక అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేపట్టే ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, డీటీలు, నోడల్ అధికారులకు ఓట్ల లెక్కింపు ప్రక్రియపై కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం తొలివిడత అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వివిధ దశలు, పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని, సొంత నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. చిన్న పొరపాటుకు కూడా తావివ్వద్దన్నారు. తొలుత విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, సిబ్బంది 6 గంటలకే తమకు కేటాయించిన లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. లెక్కింపు కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఒకవైపు ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు మరో వైపుపోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్లు అధిక సంఖ్యలో పోలైనందున లెక్కింపు పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడుతుందని, దీనికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విజయనగరం పార్లమెంట్ స్థానం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మాత్రం లెండి కళాశాలలోనే నిర్వహిస్తామని తెలిపారు. దీనికోసం 20 టేబుళ్లతో పెద్ద హాల్‌ను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో హాల్‌లో 14 టేబుళ్లను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 8 గదులను, ఈవీఎం ఓట్ల లెక్కింపు కోసం 14 హాళ్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ గదిలో సీసీ టీవీ ఉంటుందని, ఈవీఎంలు తీసుకువచ్చిన దగ్గర నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వీడియో రికార్డింగ్ చేస్తామని చెప్పారు. గుర్తింపు కార్డును విధిగా ధరించాలని, లేదంటే లోపలికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. కౌంటింగ్ హాల్‌లో రిటర్నింగ్ అధికారులతే సర్వాధికారమని, వారే పూర్తిగా నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్వో ఎస్.డి.అనిత, ట్రైనింగ్స్ నోడల్ అధికారి సుధాకరరావు, ఆర్వోలు పాల్గొన్నారు.



హాజరైన రిటర్నింగ్ అధికారులు

26న మహిళల జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

విజయనగరం: మహిళల విభాగంలో అండర్-15, అండర్-19, అండర్-23, సీనియర్ మహిళల జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 26న నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.ఎల్.ఎన్.రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం శివారు విజ్జీ క్రికెట్ ప్రాంగణంలో నిర్వహించే ఎంపిక పోటీలకు అండర్-15 బాలికల విభాగంలో హాజరయ్యే క్రీడాకారిణిలు 2009 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. అలాగే, అండర్ -19 విభాగానికి 2005 సెప్టెంబర్ 1 తరువాత, అండర్- 23 విభాగానికి 2001 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. సీనియర్ విభాగంలో హాజరయ్యే క్రీడాకారిణిలకు అదే రోజు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. పోటీలకు హాజరయ్యే వారు ఒరిజినల్ ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణపత్రం, గత మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్ తీసుకొని రావాలన్నారు. ఎంపిక పోటీలు ఉదయం 6.30 గంటలకు ప్రారంభమవుతాయని, క్రీడాకారులు వైట్ డ్రెస్, సొంత కిట్‌తో హాజరు కావాలని కోరారు.

నాటుసారా పారబోత

భామిని: మండలంలోని బత్తిలి పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో సీజ్ చేసిన 375.5 లీటర్ల సారాను గురువారం పారబోసి, క్యాన్‌లను ధ్వంసం చేశారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ ఎం. చంద్రమౌళి పర్యవేక్షణలో బత్తిలి ఎస్సై సీహెచ్ ప్రసాద్ సారథ్యంలో సారా క్యాన్లు ధ్వంసం చేశారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

విజయనగరం క్రైమ్: చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. జొన్నగుడ్డి ప్రాంతానికి చెందిన వారణాశి రామేశ్వరి (36) భర్తతో మనస్పర్థలు తలెత్తడంతో ఏడాది నుంచి బిడ్డలతో కలిసి వేరుగా ఉంటోంది. అయితే ఈ నెల 16న భర్త సూర్యనారాయణ ఇంటికి వచ్చి భార్యతో తగాదా పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆమె మెడపైన కత్తితో దాడిచేశాడు. తీవ్ర గాయాలపాలైన ఆమెను కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె గురువారం మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోసాల బారిన పడొద్దు..

గజపతినగరం: ఫేక్‌కాల్స్ ద్వారా చాలామంది మోసపోతున్నారని, సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై యు.మహేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బొండపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్న ఓ మహిళకు ఫేక్‌కాల్ ద్వారా బెదిరింపులు వచ్చాయన్నారు. తన ఆధార్ నంబర్‌పై కొన్ని కేసులు నమోదై ఉన్నాయని, అవన్నీ పోవాలంటే కొంత నగదు ముట్టజెప్పాలని సైబర్ నేరగాళ్లు ఒత్తిడి చేయడంతో ఆమె రెండు లక్షల రూపాయలు చెల్లించందన్నారు. అయితే అదంతా బోగస్ అని తేలడంతో ఆమె పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశామని చెప్పారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసినా, బ్యాంక్‌ఖాతా, ఆధార్, పాన్‌కార్డు వివరాలు అడిగినా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

చిన్నారులకు వేసవి వినోదం

విజయనగరం: జనవిజ్ఞాన వేదిక విజయనగరం జిల్లా సమత విభాగం ఆధ్వర్యంలో గురువారం వేసవి వినోదం కార్యక్రమం ప్రారంభించారు. నగరంలోని 29వ డివిజన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక సమత విభాగం రాష్ట్ర కన్వీనర్ జి. నిర్మల మాట్లాడుతూ, చిన్నారులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించేందుకు ఇటువంటి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెదడుకి మేత, క్యారంబోర్డు, దేశభక్తి గీతాలు, అభినయ గీతాలు నేర్పించనున్నట్లు తెలిపారు. చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొని వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా పూర్ణాహుతి



యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చకులు



రామకోనేరు వద్ద సుదర్శన పెరుమాళ్లకు చక్రతీర్థ స్నానం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం అనంతరం యాగశాలలో ప్రత్యేక హోమాలు నిర్వహించి, మహా పూర్ణాహుతిని సమర్పించారు. అనంతరం సుదర్శన పెరుమాళ్లను మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పల్లకిలో రామకోనేరు వద్దకు తీసుకువెళ్లి చక్రస్నానం చేయించారు. సాయంత్రం ధ్వజాఅవరోహణ కార్యక్రమాన్ని చేపట్టి ధ్వజస్తంభంపై ఎగుర వేసిన గరుత్మంతుడి చిత్రపటాన్ని వేద మంత్రోచ్చారణల నడుమ అర్చకులు కిందకి దించారు. శుక్రవారం స్వామికి పుష్పాలంకరణ కార్యక్రమం కనులపండువగా జరిపిస్తామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, సాయిరామాచార్యులు, కిరణ్, వరప్రసాద్, పవన్, దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

● 'ప్రకృతి'తో సాగుదాం



ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ఆ యూనిట్ ఇన్‌చార్జి నాగరాజు అన్నారు. జిల్లేడు ద్రావణంతో కూరగాయల పంటల్లో చీడపీడలు నివారించి ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు పొందవచ్చన్నారు. రేగిడి మండలంలోని సోమరాజుపేట, అంబఖండి గ్రామాల రైతులకు జిల్లేడు ద్రావణం తయారీ, దాని ప్రయోజనాలను విడమర్చి చెప్పారు. వంగ, మిర్చి వంటి పంటల్లో చీడపీడల నివారణకు జిల్లేడు ద్రావణం చక్కగా పనిచేస్తుందన్నారు. వరి పంటలో దోమపోటు నివారణకు తూటి ఆకు కషాయం వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు లక్ష్మునాయుడు, వరలక్ష్మి, రవి పాల్గొన్నారు.

– రేగిడి

● చండీ హోమం



వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవంపైడితల్లి అమ్మవారి చదురుగుడి, వనంగుడి ఆవరణలో గురువారం చండీయాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, తాతా రాజేష్, దూసి శివప్రసాద్ శర్మ, సాయి, తదితరులు వేదమంత్రోచ్ఛరణలతో యాగం నిర్వహించారు. యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు పర్యవేక్షించారు.

– విజయనగరం టౌన్